క్లుప్తంగా

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో రాష్ట్రానికి ద్రోహం



నినాదాలు చేస్తున్న రాజకీయ ఐక్య వేదిక నాయకులు

హిందూపురం: రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు ప్రైవేటు పరం చేసే ప్రయత్నం దుర్మార్గమని రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. సోమవారం డీఎల్‌రోడ్డులో ఎస్‌యూసీఐ ఆఫీసులో ఆర్‌ఎస్‌పీ సెక్రటరీ శ్రీనివాసులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దూరదృష్టితో చేపట్టిన ఐదు మెడికల్ కాలేజీలు పూర్తయ్యాయని, మరో రెండు చివరి దశకు చేరుకోగా, పది మెడికల్ కాలేజీలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అన్నింటినీ ప్రైవేటు పరం చేయడం రాష్ట్రానికి చేస్తున్న ద్రోహమేనన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి ఏడాది రూ.6 వేల కోట్లు ఖర్చు అవుతున్న నిధులు వెచ్చించినా మెడికల్ కళాశాలలు సుందరంగా సిద్ధం అవుతాయన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం అయితే చదువు, వైద్యం ఖరీదవుతాయన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు శ్యామ్ కిరణ్, బసవరాజ్, గిరీష్, గంగిరెడ్డి, మున్నా, నారాయణ, నరసింహమూర్తి, నాగరాజ్, నౌషాద్, రవికుమార్, నరసింహమూర్తి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డికి బెయిల్ రావడం హర్షణీయం

మడకశిర: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టించి అక్రమంగా అరెస్ట్ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా చివరకు కోర్టులో మిథున్‌రెడ్డికి న్యాయం జరిగిందని చెప్పారు. లేని లిక్కర్ స్కాంను కూటమి ప్రభుత్వం సృష్టించి వైఎస్ జగన్‌కు సన్నిహితంగా ఉండే వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసిందని విమర్శించారు. తప్పకుండా చివరకు న్యాయమే గెలుస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎన్ రవిశేఖర్‌రెడ్డి, వాగేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశ్వర్థనారాయణ తదితరులు కూడా వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి భూమి పూజ



పీహెచ్‌సీ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

పరిగి: మండలంలోని ఊటుకూరులో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత సోమవారం భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, మెడికల్ ఆఫీసర్లు స్వరూపారెడ్డి, రూబి, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలు మినహా విధులు బహిష్కరిస్తున్నామంటూ నిరసన కార్యక్రమాల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్లు మంత్రి సవిత ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. పాలకులపై ఉన్న శ్రద్ధ పీహెచ్‌సీలకు వచ్చిన రోగులపై ఎందుకు లేదని ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. సోమవారం చైర్మన్ నరసింహరాజు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ మీట్ జరిగింది. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కమిషనర్ జగన్నాథ్ సమాధానం ఇస్తూ మున్సిపాలిటీలో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. వీధి దీపాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు వెంకటలక్ష్మమ్మ, ప్రభావతి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల నిరసన బాట

- పీహెచ్‌సీల్లో నిలిచిపోయిన ఓపీ సేవలు
- తీవ్ర ఇబ్బందులు పడిన రోగులు



అగళి: వైద్య సిబ్బంది లేక ఖాళీగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



లేపాక్షి: నిర్మానుష్యంగా ఉన్న లేపాక్షి పీహెచ్‌సీ

మడకశిర: నియోజకవర్గంలో వివిధ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సోమవారం నుంచి సమ్మె ప్రారంభించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వారు సమ్మెకు దిగారు. నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. అత్యవసర వైద్య సేవలను మాత్రమే అందించారు. ఓపీ సేవలు నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీహెచ్‌సీలకు వచ్చిన రోగులు వెనుతిరిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. నియోజకవర్గంలో అమరాపురం, హేమావతి, అగళి, గుడిబండ, కల్లుమర్రి, నీలకంఠాపురం, కదిరేపల్లి, గుందుమల, మడకశిర అర్బన్ తదితర ప్రాంతాల్లో పీహెచ్‌సీలు ఉన్నాయి. అయితే వాటిలో పని చేసే డాక్టర్లు తమ సమస్యలపై సమ్మె ప్రారంభించడంతో రోగులకు వైద్య సేవలందక ఇబ్బందులు పడ్డారు.

మడకశిరరూరల్: మండలంలోని వివిధ గ్రామాల నుంచి చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులు ఓపీ సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. చేసేదిలేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం వెంటనే వైద్యుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అమరాపురం: మండలంలోని హేమావతి, అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు పీహెచ్‌సీలో డాక్టర్లు హాజరు కాకపోవడంతో రోగులు వెనుతిరిగారు.

చిలమత్తూరు: నియోజకవర్గంలోని హిందూపురం రూరల్, చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లోని పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఓపీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏఎన్‌ఎంలు రోగులకు చికిత్స చేసి పంపే పరిస్థితి ఏర్పడింది. అత్యవసర సేవలకు కూడా కొన్ని చోట్లే వైద్యాధికారులు అందుబాటులో ఉండటంతో రోగులు నానా అవస్థలు పడ్డారు. పేదలకు అందాల్సిన వైద్య సేవలు స్తంభించడంతో రోగులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. నియోజకవర్గంలోని చిలమత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు మహిళా వైద్యులు సమ్మె బాట పట్టారు. సోమవారం సుమారు 60 మంది రోగులు ప్రభుత్వాస్పత్రికి రాగా, ఏఎన్‌ఎంలు మందులు ఇచ్చి పంపించి వేశారు.

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టారు. సోమవారం ఆస్పత్రికి వచ్చిన రోగులు వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు.

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ బంద్ చేసి వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. రోజూ పీహెచ్‌సీకి 150 నుంచి 200 మంది వచ్చేవారు. ఓపీ బంద్ కావడంతో వైద్య సేవలు అందించేవారు లేక పేషెంట్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పెనుకొండ: పీహెచ్‌సీల్లో వైద్యులు నిరసనకు దిగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసనకు దిగిన వైద్యులు అత్యవసర సేవలను మాత్రమే అందించారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చిన్న జబ్బులకే రూ. 400 నుంచి రూ. 500 వందల దాకా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వైద్యం కోసం వచ్చిన వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెనుకొండ మండలంలోని గుట్టూరు, సోమందేపల్లి, రొద్దం, పరిగి, గోరంట్ల పీహెచ్‌సీల్లో వైద్యులు నిరసన బాట పట్టారు.

గుడిబండ: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు తమ విధులను సోమవారం బహిష్కరించారు. కేవలం అత్యవసర చికిత్సలు మాత్రమే అందించారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ పీజు కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు ఇన్ సర్వీస్ కోట కుదించడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైద్యులు డిమాండ్ చేశారు. డాక్టర్ శివానంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘అవినీతి’ పై వైఎస్సార్‌సీపీ ఆందోళన

- డీపీఆర్ టెండర్లలో ఖర్చు శాతం పెంచడంపై ఆగ్రహం
- కౌన్సిల్ మీట్‌ను వాకౌట్ చేసిన సభ్యులు



కౌన్సిల్ మీట్ నుంచి బయటకు వచ్చి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

చిలమత్తూరు: మున్సిపాలిటీ భవన నిర్మాణానికి డీపీఆర్ టెండర్లలో జరిగిన అవినీతి బాగోతంపై మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ మీట్ నిర్వహించారు. అజెండాలో 16 అంశాలను చర్చించేలా రూపొందించారు. మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణానికి రూ.18.30 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రభుత్వం డీపీఆర్ తయారు చేసి పంపాలని సూచించింది. ఇందులో ఒక శాతం కంటే తక్కువ ఖర్చు చూపాల్సిన అధికారులు 2.79 శాతానికి పెంచి టెండర్ ఖరారు చేయడాన్ని కౌన్సిలర్లు తప్పు పట్టారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసేందుకు కుట్ర పన్నారని, ఏకంగా రూ.33 లక్షలు కాజేసేందుకు ప్లాన్ వేశారన్నారు. అందుకే డీసెంట్ నోటీసు అందిస్తున్నట్లు తెలిపారు.

అధికారులు టీడీపీ నేతలతో తిరిగితే తప్పేంటి?

మున్సిపాలిటీ అధికార యంత్రాంగం ప్రభుత్వ కార్యక్రమాల విషయంలో స్థానిక కౌన్సిలర్లకు కనీసం సమాచారం ఇవ్వడం లేదు. కేవలం టీడీపీ వార్డు ఇన్‌చార్జ్‌లతో కలిసి కార్యక్రమాలను పూర్తి చేస్తున్నారు’ అని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి చైర్మెన్ రమేష్‌ను ప్రశ్నించారు. అధికారులు టీడీపీ నేతలతో తిరిగితే తప్పేంటని సమాధానం చెప్పడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆందోళన నిర్వహించారు. వాళ్లతోనే కార్యక్రమాలను జరుపుకుంటున్నప్పుడు కౌన్సిల్ ఎందుకని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా ప్రశ్నించారు. వెంటనే వైఎస్సార్‌సీపీ వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు నాగేంద్రబాబు, మల్లికార్జున, రోషన్ అలీ తదితరులు చైర్మన్‌కు డీసెంట్ నోటీసిచ్చారు. ఆ తర్వాత కౌన్సిల్‌ను వాకౌట్ చేసి నిరసన తెలిపారు.

టేబుల్ ఎజెండాతో ప్రతిపాదనలు ఆమోదం

వైఎస్సార్‌సీపీ సభ్యులు సమావేశాన్ని వాకౌట్ చేసిన వెంటనే చైర్మన్ డీఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున టేబుల్ ఎజెండా ప్రవేశ పెట్టారు. టేబుల్ ఎజెండా అన్నదే నిబంధనలకు విరుద్ధం. అయితే ఎలాగైనా టీడీపీ నేతలు, కాంట్రాక్టర్లకు మేలు కలిగించే విధంగా ఎజెండా రూపొందించడం గమనార్హం. ఎస్‌కేడీ పంప్‌హౌస్‌లో తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి టెండర్ దక్కించుకునేందుకు ప్రయత్నించిన కాంట్రాక్టర్ ప్రభాకర్‌కు ‘సాక్షి’ కథనం ద్వారా బ్రేక్ పడింది. అతడిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాల్సిన అధికారులు ఆ ప్రస్తావన అంశం లేకుండా చేశారు. తాజాగా శివ ట్రాన్స్‌ఫార్మర్ కాంట్రాక్టర్ చేతికి పనులు కట్టబెట్టారు.

జగన్ చిత్రాలతో కూటమి పైశాచిక ఆనందం

- మెడికల్ కళాశాలల అంశాన్ని తప్పుదోవ పట్టించేందుకే ఎత్తుగడ
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్, భూమన కరుణాకర్‌రెడ్డి చిత్రాలతో కూటమి నాయకులు హిందూపురం పట్టణంలో పోస్టర్లు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికారం కోసం కూటమి నేతలు చేయకూడని దారుణాలన్నీ చేశారని, అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేస్తూ రాష్ట్రాన్ని బిహార్‌లా మార్చేశారన్నారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా టీడీపీ నేతలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశం నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మాజీ సీఎం జగన్ చిత్రాలతో పోస్టర్లు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతలు క్రిమినల్ ఆలోచనలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. పేదలకు వైద్యవిద్యను దగ్గర చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్ జగన్.. విద్య, వైద్యం విషయాల్లో ఎన్నడూ నిర్లక్ష్యంగా లేరన్నారు. అలాంటి వ్యక్తిపై కూటమి చేస్తున్న అబద్ధపు ప్రచారాలు, నిందలు అన్నీ నిరాధారమైనవన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఎం ముత్యాలప్పకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అమరాపురం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వీఓఏలు ఏపీఎం ముత్యాలప్పకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీఓఏలు పద్మావతి, హనుమక్క, లత, నాగరాజు తదితరులు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించాలని, హెచ్ ఆర్ పాలసీ వర్తింపజేయాలన్నారు.

వివిధ సమస్యల పరిష్కారానికి అర్జీలు

పెనుకొండ రూరల్: ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా వివిధ సమస్యలపై 10 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం

లేపాక్షి: మండలం ఉప్పరపల్లి ఎస్సీ కాలనీలో అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నమ్మ, రూరల్ సీఐ జనార్దన్, ఎంపీడీఓ నరసింహమూర్తి, పంచాయితీ కార్యదర్శి రమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రొళ్ల: గ్రామాల్లో ప్రతి ఒక్కరు సమానత్వంతో మెలగాలని తహసీల్దార్ షేక్షావలి, ఏఎస్ఐ ఈదాయితుల్లా పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రం ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆర్ఐ గిరియప్ప, సర్వేయర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ అవసరాలకు స్థలం కేటాయించాలి

రొద్దం: మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని గ్రామ అవసరాలకు కేటాయించాలని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజుకు వినతిపత్రం అందించారు. గ్రామ సమీపంలో ఉన్న 35 సెంట్ల స్థలాన్ని ఓ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులకు కేటాయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎవరికీ ఆ స్థలాన్ని కేటాయించరాదంటూ గ్రామస్తులు అధికారులకు కలసి విన్నవించారు. ఖాళీ స్థలంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేస్తునట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. తహసీల్దార్ మట్లాడుతూ ఆ స్థలాన్ని ఎవరికి కేటాయించలేదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: ప్రభుత్వ ఉచిత పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ సూచించారు. స్థానిక టీపీఎస్ ఆవరణం లో రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భవన నిర్మాణ, చేతి వృత్తుల కార్మికులకు సురక్షిత కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం కార్మికులకు టూల్ కిట్స్ పంపిణీ చేశారు.

అధికారులను నియమించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణారెడ్డి

చిలమత్తూరు: మండలంలో రెగ్యులర్‌గా విధులు నిర్వహించే అధికారులు ఒక్కరూ లేరని తహసీల్దార్ , ఎంపీడీఓ, సబ్ రిజిస్ట్రార్ అందరూ ఇన్‌చార్జ్‌లే ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. వెంటనే రెగ్యులర్ అధికారులను నియమించాలని సోమవారం పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ శ్యామ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అలాగే టేకులోడు భూసేకరణలో భాగంగా అర్హులైన రైతులకు మాత్రమే పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

‘గుర్రపుకొండ’లో కార్డెన్ సెర్చ్

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుర్రపుకొండ గ్రామంలో సోమవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామ వీధుల్లో పర్యటించి తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మట్కా, జూదం వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. నాటుసారా, కర్ణాటక మద్యాన్ని ఎవరైనా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందూ కలసి మెలసి జీవనం సాగించాలన్నారు.

వాల్మీకి భవన్‌కు స్థలం కేటాయిస్తాం

పెనుకొండ: వాల్మీకి భవన్‌కు తగిన స్థలం కేటాయిస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం సోమందేపల్లి మండలానికి చెందిన వాల్మీకులు మంత్రిని కలసి వాల్మీకి భవన్‌కు మండల కేంద్రంలో స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి త్వరలో స్థలం కేటాయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా నిధులు విడుదలకు కృషి చేస్తానన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

లేపాక్షి: మండలంలోని సీ వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్‌ముస్తఫా అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్పలతో పాటు పలువురు ఉపాధ్యాయులు, సంఘం నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి షేక్ ముస్తఫా మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అంత్యక్రియలకు రూ. 25 వేలు అందించారు.

విద్యుత్ పనుల అడ్డగింత



విద్యుత్ పనులు అడ్డుకుంటున్న రైతులు

హిందూపురం: తమ పొలాల మీదుగా ప్రమాదకరంగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడం సరికాదంటూ గుడ్డంపల్లి రైతులు మండల ట్రాన్స్‌కో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గుడ్డంపల్లి సమీపంలోని పొలాల వద్ద విద్యుత్తు లైన్ల పనులు ఆపాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. శ్రీనివాసులు, అశ్వర్థప్ప మాట్లాడుతూ అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని వివాద స్థలాల్లో బోర్లు, విద్యుత్ కనెక్షన్ కోసం లైన్ ఏర్పాటు చేస్తున్నారని వాపోయారు. దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం కూడా సమర్పించామన్నారు.

నేడు ‘పురం’లో వైఎస్సార్‌సీపీ నిరసన

మడకశిర: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం హిందూపురం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నిరసన చేపట్టనుంది. హిందూపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9.30 గంటలకు నిరసన చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అగళి: మూత్ర విసర్జన చేస్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సద్దాం హుస్సేన్ (30) బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని ఉల్లేకెర గ్రామ సమీపాన మండే మారమ్మ గుడి దగ్గర హైవేపై జరిగిన ప్రమాదంలో సద్దాం హుస్సేన్ గాయపడిన సంగతి పాఠకులకు తెలిసిందే. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి ఆలయాల నూతన కమిటీ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఈఓ నరసింహరాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. భక్తరపల్లి ఆలయ ఆవరణలో కమిటీ చైర్మన్‌గా నర్సేగౌడుతో పాటు సభ్యులతో దేవాలయశాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సర్పంచులు కరియన్న, రామాంజినేయులు, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు అధ్యక్షుడు గురుమూర్తి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని జాతీయ రహదారిలో హిందూపురం రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ చెన్నయ్య ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, ఎక్కువ మంది ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటోలతో పాటు ఇతర వాహనాలను తనిఖీ చేసి అపరాధ రుసుం విధించారు.

సరస్వతీ నమస్తుభ్యం



మడకశిర: సరస్వతీదేవిగా వడిశిలమ్మ



పెనుకొండ: సరస్వతీదేవిగా మహేశ్వరీదేవి

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి బృందం



హిందూపురం: వీణాపాణి రూపంలో గంగమ్మదేవి